రైతులకు అందని 'సహకారం'

- సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, యంత్రాల ఊసేలేదు
- నాలుగేళ్లుగా అన్నదాతలకు తప్పని ఎదురుచూపు


నారాయణగూడెం సహకార సంఘం కార్యాలయం

పెన్‌పహాడ్‌ : వ్యవసాయమే జీవనోపాధిగా ఎంచుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి సహకారం కొరవడింది. సాగు పరికరాలు, యంత్రాలపై రాయితీ ఎత్తివేయడంతో చిన్న, సన్నకారు రైతులకు సాగు కష్టతరంగా మారింది. వెన్నంటి ఉండే సహకార సంఘాల ప్రోత్సాహం లేక.. సాగు కష్టంగా మారిందని కర్షకులు వాపోతున్నారు. రాయితీపై సరఫరా చేసే సాగు సామగ్రి కోసం రైతులు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు. యేటా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా సబ్సిడీపై అందజేసే యంత్రాలు, యంత్రపరికరాలు, ఎరువులు, విత్తనాల ఊసే లేకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వానాకాలం సీజన్‌ సమీపిస్తున్న నేపథ్యంలో సహకార సంఘాలు, వ్యవసాయ అధికారుల నుంచి ఎటువంటి సమాధానం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ కార్యాలయంలో సుమారు 2300 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. నారాయణగూడెం సహకార కార్యాలయంలో సుమారు 3250 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో.. సంఘాలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం, తిరిగి తీసుకోవడం, ధాన్యం కొనుగోళ్ల వరకే పరిమితమయ్యాయని కర్షకులు చెబుతున్నారు.

నష్టపోతున్న రైతులు..

వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి, అధిక దిగుబడి సాధించి రైతులు ఆర్థికంగా బలోపేతమయ్యేలా సహకార సంఘాలు కృషి చేసేవి. సాగు పద్ధతులు, అవసరమైన యంత్ర పరికరాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించేవి. కానీ నాలుగేళ్లుగా సొసైటీలు అవేవి ఇవ్వడం లేదు. వాటిపై ప్రభుత్వం రాయితీ ఎత్తివేసింది. దీంతో రైతులు తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం ప్రయివేట్‌ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నాణ్యత లేని ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ నష్టపోతున్నారు. ఇక పంట రుణాల్లో రూ. 25వేలు మాఫీ అని చెప్పిన ప్రభుత్వం.. నేటికీ స్పష్టత ఇవ్వడంలేదు.

శాస్త్రవేత్తల సూచనలేవి..?

పంట ఉత్పత్తులను విక్రయిస్తే వచ్చే ఆదాయం కంటే ఖర్చు అధికం కావడంతో అన్నదాతలు అప్పుల పాలవుతున్నారు. సహకార సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు కొరవడి రైతులు నష్టపోతున్నారు. ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసి అధిక దిగుబడి, సేంద్రియ సేద్యం, వాటి పద్ధతులు, ఎరువుల వాడకం, లాభసాటి పంటలు తదితర అంశాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు అంటున్నారు. ఆధునాతన సాగు పరికరాలు, యంత్రాలు, ట్రాక్టర్లు, పంపుసెట్లు తదితర వాటి ధరలు లక్షల్లో ఉంటాయి. వాటిని సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసి అద్దెకు ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు. నమ్మకమైన కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని వానాకాలం సాగుకు తక్కువ ధరకు విత్తనాల పంపిణీకి సంఘాలు కృషి చేయాలని వారు వేడుకుంటున్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి



మార్కెట్‌లో నకిలీ విత్తనాల దందా ఎక్కువగా ఉంది. చిన్న, సన్నకారు రైతులు అప్పులు తెచ్చి వ్యాపారుల మాటలు నమ్మి నాసిరకం విత్తనాలు కొనుక్కోవాల్సి వస్తుంది. దీంతో దిగుబడి లేక నష్టపోతున్నాం. సహకార సంఘాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలి. – సాయిరి నరేష్‌, రైతు, అనంతారం

చెత్తమయంగా హైవే పరిసరాలు


అర్వపల్లిలో హైవేకు ఇరువైపులా పోసిన చెత్త, ఇతర వ్యర్థాలు

అర్వపల్లి : అర్వపల్లిలోని నకిరేకల్‌–తానంచర్ల రహదారిపై తుంగతుర్తి రోడ్డు ఇరువైపులా చెత్తమయంగా దర్శనమిస్తోంది. అలాగే ఈహైవే వెంట అర్వపల్లి నుంచి సీతారాంపురం సమీపంలోని 71డీబీఎం కాలువ వరకు డంపింగ్‌ యార్డులా మారిపోయింది. స్థానికులు, వ్యాపారులు చెత్త, తాగేసిన కొబ్బరి బోండాలు, ఇతర వ్యర్థాలను నిత్యం రోడ్డు వెంట పోసి వెళ్తున్నారు. కోతులు, కుక్కలు ఈ వ్యర్థాలపై పడి చిందరవందర చేస్తుండడంతో చెత్తతోపాటు కొబ్బరి బోండాలు రోడ్లపైకి చేరి వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. అలాగే రోడ్డు వెంట వ్యర్థాలు పోయడంతో దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది నిత్యం ఇంటింటికీ, ప్రతి దుకాణానికి వెళ్లి చెత్త ట్రాక్టర్‌ ద్వారా చెత్తను సేకరిస్తున్నారు. కొంతమంది అందులో వేయకుండా రాత్రి వేళల్లో వెళ్లి రోడ్ల వెంట పోస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంటోందని, ఇప్పటికైనా హైవే వెంట చెత్త పోయకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సీపీఐ ప్రజాగర్జన పోస్టర్‌ ఆవిష్కరణ


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడంతో పాటు రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ జూన్‌ 4న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్‌ నాయకుడు, మాజీ కౌన్సిలర్‌ దొరెపెల్లి శంకర్‌, మైనార్టీ నాయకుడు పాషా, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్‌, హరి, తాళ్ల సైదులు, వాడపల్లి గోపి, దిండుగల సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, తహసీల్దార్‌

నూతనకల్‌ : కల్యాణలక్ష్మి పథకం ఆడపిల్లలకు వరంలాంటిదని జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల తహసీల్దార్‌ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ ఎండీ జమీరుద్దీన్‌, బత్తుల సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బుర్కపిట్టతండాలో బొడ్రాయి శంకుస్థాపన

సూర్యాపేట రూరల్‌ : సూర్యాపేట మున్సిపల్‌ పరిధిలోని 15వ వార్డు బుర్కపిట్టతండాలో సోమవారం బొడ్రాయి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్‌ చైర్మన్‌ వట్టె జానయ్య యాదవ్‌ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో కౌన్సిలర్లు వట్టె రేణుక, వేములకొండ పద్మ, బీఆర్‌ఎస్‌ పట్టణ ఉపాధ్యక్షుడు ఎండీ చాంద్‌పాష, 13వవార్డు బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు ఎస్‌కె. రఫీ, నాయకులు మాలోతు పంతులు నాయక్‌, భూస శ్రీధర్‌, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల ముందస్తు అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న వీఓఏలు

పెన్‌పహాడ్‌ : చలో హైదరాబాద్‌ కార్యక్రమానికి వెళ్తున్న వీఓఏలను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌ గౌడ్‌ తెలిపారు. ఈ సందర్భంగా మండల వీఓఏల అధ్యక్షుడు దూత శ్రీనివాస్‌, ఉపాధ్యక్షుడు జానయ్య మాట్లాడారు. తమ సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

నూతన గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత


గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న కొల్లు శ్రీనివాస్‌


సూర్యాపేట రూరల్‌ : మండల పరిధిలోని కాసరబాద గ్రామంలో నూతన గ్రంథాలయానికి కొల్లు రాములుగౌడ్‌ జ్ఞాపకార్థం కుమారుడు కొల్లు శ్రీనివాస్‌ పోటీ పరీక్షలకు సంబంధించిన 44 పుస్తకాలను సోమవారం విరాళంగా అందజేశారు. బుక్‌ ఛాలెంజ్‌ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఛాలెంజ్‌ను ప్రతి ఒక్కరూ స్వీకరించి గ్రంథాలయానికి ఒక పుస్తకాన్ని అందజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సలీం, నారబోయిన లక్ష్మయ్య, రాజు, రాము, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

కేతమ్మ మృతికి సంతాపం


కేతమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గుడిపాటి నర్సయ్య

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు భైరు కేతమ్మ సోమవారం గుండెపోటుతో మృతి చెందింది. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ గుడిపాటి నర్సయ్య సోమవారం మృతురాలి భౌతికకాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్‌, సర్పంచ్‌ మిట్టగడ్పుల అనోక్‌, కుంచాల ప్రవీణ్‌రెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురప్ప జాతర


వేడుకల్లో పాల్గొన్న యాదవులు

మోతె : మండల పరిధిలోని రావిపహాడ్‌ గ్రామంలో 60 ఏళ్ల క్రితం నుంచి పూజలకు నోచుకోక శిథిలావస్థకు చేరిన గురప్ప దేవాలయాన్ని రావిపహాడ్‌, కోటపహాడ్‌ యాదవ కులస్తులు పునఃనిర్మాణం చేసి సోమవారం అంగరంగ వైభవంగా జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లతో మహిళలు బోనాలతో ప్రదర్శనగా వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో యాదవ కుల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆనాటి గురువులతో పూర్వవిద్యార్థులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం 2000–2001 బ్యాచ్‌ పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్న నాడు తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేసి కలిసిన గుర్తుగా జ్ఞాపికలను అందజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా అనుసంధాన రహదారులు

- పక్కా రోడ్లకు నోచుకోని పలు గ్రామాల అనుసంధాన రహదారులు
- జాజిరెడ్డిగూడెం మండలంలో 20కిపైగానే లింక్‌ రోడ్లు


రామన్నగూడెం–కుంచమర్తి గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న లింక్‌రోడ్డు


కాసర్లపహాడ్‌–వేల్పుచెర్ల దారి ఇలా..

అర్వపల్లి : గ్రామాల అనుసంధాన రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల లింక్‌ రోడ్లు ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు ఎన్నో వ్యయప్రయాసాలకు లోనవుతున్నారు. ఈ అనుసంధాన రహదారులను పక్కా రోడ్లుగా మార్చి తమ ఇబ్బందులు తీర్చాలని వివిధ గ్రామాల ప్రజలు అధికారులకు ఎన్నో ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని వివిధ గ్రామాల రహదారులు అధ్వానంగా మారాయి.

అనుసంధాన రహదారులు సరిగాలేక..

జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్‌ గ్రామం నుంచి వేల్పుచెర్ల, మర్రిబాయి తండాలకు వెళ్లే అనుసంధాన రహదారులు అధ్వానంగా మారాయి. అలాగే రామన్నగూడెం–కుంచమర్తి మధ్య లింక్‌రోడ్డు కంపచెట్లతో నిండి బురదమయంగా మారింది. జాజిరెడ్డిగూడెం నుంచి కొత్తగూడెం వెళ్లే లింక్‌ రోడ్డు కూడా ఇలాగే మారింది. కొత్తగూడెం గ్రామస్తులు ఉపాధిహామీ కూలీ డబ్బులు, పింఛన్ల కోసం ప్రతినెలా జాజిరెడ్డిగూడెం వెళ్తుంటారు. కానీ ఈదారి కంపచెట్లతో నిండి గుంతలమయం కావడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అలాగే అడివెంల నుంచి తిమ్మాపురం వెళ్లే లింక్‌ రోడ్డు కూడా అధ్వానంగా తయారైంది. ఈదారి వెంట నిత్యం 100మందికి పైగానే రైతులతోపాటు అడివెంల నుంచి తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు ప్రతిరోజు 20మందికి పైగానే పిల్లలు చదువులకోసం వెళ్తుంటారు. తిమ్మాపురం నుంచి కందగట్లకు వెళ్లే లింక్‌రోడ్డు, అడివెంల నుంచి కోమటిపల్లికి, కుమ్మరిగూడెం గ్రామానికి వెళ్లే లింక్‌రోడ్డు, కోడూరు నుంచి తాళ్లసింగారం, కొమ్మాల నుంచి మర్రిబాయితండా, మేడిబాయితండా, జాజిరెడ్డిగూడెం నుంచి పర్సాయపల్లికి వెళ్లే రోడ్లతోపాటు వివిధ గ్రామాల్లో 20కిపైగానే లింక్‌రోడ్లు కంపచెట్లతో నిండి, గుంతలమయమై అధ్వానంగా మారాయి. ఈ రహదారులు సరిగా లేక ఆయా గ్రామాలప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుండటంతో ఎన్నో వ్యయప్రయాసాలకు లోనవుతున్నారు. పంచాయతీరాజ్‌ శాఖ అధికారులు వెంటనే ఈలింక్‌రోడ్లను పక్కా రోడ్లుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నో వ్యయ ప్రయాసాలకు లోనవుతున్నాం



కుంచమర్తి నుంచి రామన్నగూడేనికి వెళ్లే లింక్‌రోడ్డు కంపచెట్లతో నిండి నడిచి కూడా వెళ్లలేని విధంగా మారింది. ఈదారిలో ఐదారు గ్రామాల ప్రజలు, రైతులు వెళ్తుంటారు. దారి సరిగా లేక చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో వ్యయప్రయాసాలకు లోనవుతున్నాం. – ఎస్‌కె.సయ్యద్‌, కుంచమర్తి

పల్లె దారులను పక్కారోడ్లుగా మార్చాలి



కాసర్లపహాడ్‌ నుంచి వేల్పుచెర్ల, మర్రిబాయితండాలకు వెళ్లే లింక్‌రోడ్లు కంపచెట్లతో నిండిపోయాయి. కాసర్లపహాడ్‌ నుంచి మర్రిబాయితండాకు వెళ్లే లింక్‌రోడ్డును పక్కా రోడ్డుగా మార్చుటకు 15ఏళ్ల కిందట శిలాఫలకం కూడా వేశారు. కానీ ఇంత వరకు పని మొదలు కాలేదు. వీటితోపాటు మండల వ్యాప్తంగా అన్నిగ్రామాల లింక్‌రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలి. – మచ్చ నర్సయ్య, కాసర్లపహాడ్‌

ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలి


వేడుకల్లో పాల్గొన్న చెవిటి వెంకన్నయాదవ్‌

మద్దిరాల : ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌ అన్నారు. యాదవులు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న యలమంచమ్మ పండుగకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు, కసనబోయిన లింగయ్య, అవిలయ్య, అశోక్‌, రమేష్‌, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


గొట్టిపర్తిలో మల్లయ్యకు ఆర్థికసాయం అందజేస్తున్న ఏపూరి సోమన్న

తుంగతుర్తి : మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామానికి చెందిన చీకటి మల్లయ్య ఇటీవల అనారోగ్యానికి గురవడంతో విషయం తెలుసుకున్న వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న సోమవారం బాధితుడిని పరామర్శించారు. రూ.10,000 ఆర్థికసాయం అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన చింతకుంట్ల లాలయ్య, చింతకుంట్ల లక్ష్మిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5,000 చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు చింతకుంట్ల పరమేష్‌, ఏపూరి యాకన్న, చింతకుట్ల సైదులు, మాచర్ల ఉపేందర్‌, జలగం కళ్యాణ్‌, మందుల యాదగిరి, మాచర్ల గణేష్‌, చింతకుంట్ల నాగేష్‌, శ్రీను, దిలీప్‌నాయకుడు, మహేష్‌, దయ, రవి, నాగయ్య, సాంబయ్య, అంజయ్య, వెంకన్న, సురేందర్‌, ఉపేందర్‌, రిషి, ప్రేమ్‌ పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభమెప్పుడో..

- ఇటీవల పూర్తయిన ఆత్మకూరు గ్రంథాలయ భవన నిర్మాణ పనులు
- వెంటనే అందుబాటులోకి తేవాలని కోరుతున్న పాఠకులు


అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ భవనం

ఆత్మకూర్‌(ఎస్‌) : మండల కేంద్రంలోని గ్రంథాలయ నిర్మాణ పనులు మూడెళ్లుగా కొనసాగి ఇటీవలే పూర్తయ్యాయి. మండల కేంద్రంలో రూ.15లక్షల అంచనా వ్యయంతో డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి గ్రంథాలయం కోసం గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రభుత్వం నూతన భవనాన్ని 2020 జూన్‌లో మంజూరు చేసింది. అప్పట్లోనే పనులు ప్రారంభమై మూడెళ్లు కొనసాగాయి. భవన నిర్మాణానికి మొదటి విడతలో ప్రభుత్వం అందజేసిన రూ.15లక్షల నిధులు సరిపోకపోవడంతో కొంత పనులు ఆగిపోయాయి. అనంతరం మరికొన్ని నిధులు మంజూరు చేయగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్‌ సంబంధిత పనులు, భవనంలో పుస్తకాలను భద్రపర్చేందుకు కావాల్సిన మెటీరియల్‌ తదితర పనులు పూర్తిచేశారు. ఇప్పుడు గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించాల్సి ఉంది.

వినియోగంలోకి తెస్తే ఎంతో మేలు..

విద్యార్థులకు, యువకులకు మండల కేంద్రంలోని గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ గ్రంథాలయ భవనం అందుబాటులోకి వస్తే దాదాపు 100 మంది నిరుద్యోగ యువత ఇక్కడే ఉండి చదువుకునే అవకాశం ఉంటుంది. అలాగే స్థానికంగా నిత్యం గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. కావున ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ గ్రంథాలయ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భవనాన్ని అందుబాటులోకి తేవాలి



ప్రస్తుత తరుణంలో గ్రంథాలయ భవనాలు పాఠకులకు ఎంతో అవసరం. ప్రధానంగా నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి గ్రంథాలయం చదువుకునేందుకు వీలుగా ఉంటుంది. గ్రంథాలయాన్ని వెంటనే ప్రారంభించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. – దేగల వెంకటక్రిష్ణ

పనులు పూర్తయ్యాయి

మండల కేంద్రంలోని గ్రంథాలయ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవలనే భవనాన్ని గ్రంథాలయ సంస్థకు అప్పగించాం. త్వరలో అందుబాటులోకి వస్తుంది. – బాబుబావు, పీఆర్‌ఏఈ

పోలీసుల దాడి హేయమైన చర్య


మాట్లాడుతున్న వజ్జె వినయ్‌యాదవ్‌

అర్వపల్లి : మోతె మండలం విభళాపురంలో అర్హులైన పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కేటాయించాలని శాంతియుతంగా ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, సీపీఎం మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీపీఎం శ్రేణులపై పోలీసులు దాడి చేయడం హేయమైన చర్య అని తెలంగాణ గొర్రెల మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్‌) జిల్లా సహాయ కార్యదర్శి వజ్జె వినయ్‌యాదవ్‌ అన్నారు. సోమవారం జాజిరెడ్డిగూడెంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అకారణంగా సీపీఎం నాయకులపై పోలీసులు మూకుమ్మడిగా దాడి చేయడాన్ని ప్రజాతంత్రవాదులు, మేధావులు ఖండించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి శిగ వెంకన్న, కొమ్ము విజయ్‌, జడ గణేష్‌, వజ్జె సాయి, వీరయ్య, శేఖర్‌ పాల్గొన్నారు.

మోతె ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

నాగారం : వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, సీపీఎం జిల్లా నాయకుడు మట్టపల్లి సైదులుపై దాడిచేసిన మోతె ఎస్‌ఐ మహేష్‌ను సస్పెండ్‌ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడియం కుమార్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం నాగారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. ఆయనతో పాటు కండె భిక్షం, సోమయ్య, పద్మ, వెంకటేశ్వర్లు, వెంకన్న, మారయ్య, స్వరూప తదితరులు ఉన్నారు.

పశ్య వెంకటరెడ్డికి పలువురి నివాళి


వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, తదితరులు

కోదాడరూరల్‌ : కోదాడ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, లక్ష్మీగణేష్‌ రైస్‌ ఇండస్ట్రీస్‌ అధినేత పశ్య వెంకటరెడ్డి ఇటీవల మృతి చెందారు. సోమవారం పట్టణ పరిధిలోని తమ్మరలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించి ఆయన సంతాప సభకు పలు పార్టీల ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారులు అనిల్‌రెడ్డి, నవీన్‌రెడ్డిలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్‌ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, బీఆర్‌ఎస్‌ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్‌.లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, ఎంపీపీ చందురు వెంకటేశ్వర్లు, గుండపనేని నాగేశ్వరరావు, జయప్రకాశ్‌, చక్కర చిన్నపరెడ్డి, వెంపటి మధుసూదన్‌, వనపర్తి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యకు కృషి చేయాలి


టీపీటీఎఫ్‌ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, సంఘం నాయకులు

కోదాడ : టీపీటీఎఫ్‌ ఉపాధ్యాయులు శాస్త్రీయ విద్య కోసం కృషి చేయాలని టీపీటీఎఫ్‌ నాయకులు కోరారు. సోమవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో టీపీటీఎఫ్‌ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్‌ సంఘం పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కామన్‌ స్కూల్‌, శాస్త్రీయ విద్యావిధానాల కోసం ఉద్యమించాలని కోరారు. హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించాలన్నారు. ప్రభుత్వ రంగ విద్యా సంస్థలను రక్షించుకోవాలని, పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించడానికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి కోర్టులలో ఉన్న కేసులను తక్షణమే పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బడుగుల సైదులు, ముత్తవరపు రామారావు, డీఎస్‌ స్వామి, సీహెచ్‌.భిక్షం, రామనర్సయ్య, కోటయ్య, హనుమంతరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

30న యాగన్న వర్ధంతి సభ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నాగారం : జాజిరెడ్డిగూడెంలో ఈ నెల 30న సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమోక్రసీ సీనియర్‌ నాయకుడు పోలేబోయిన యాగన్న 2వ వర్ధంతి సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్‌ డివిజన్‌ అధ్యక్షుడు సంపేట కాశయ్య కోరారు. సోమవారం డి.కొత్తపల్లిలోని చంద్రారెడ్డినగర్‌లో నేపాల్‌రెడ్డి స్మారక స్థూపం వద్ద బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. 30న జాజిరెడ్డిగూడెంలో యాగన్న స్థూపావిష్కరణ, బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమోక్రసీ నాయకులు బయ్యం లింగయ్య, కళింగారెడ్డి, పేరమల్ల సత్తయ్య, ఎల్లయ్య, బయ్యం లింగమల్లు, యాకస్వామి, పవన్‌, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు నడిగూడెం మండల సర్వసభ్య సమావేశం

నడిగూడెం : జూన్‌ 2 నుంచి తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం మండల సర్వసభ్య అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ ఉంటుందని తెలిపారు.

సోమమ్మకు సన్మానం


సోమమ్మను సన్మానిస్తున్న గ్రామస్తులు

సూర్యాపేట రూరల్‌ : కాసరబాద గ్రామ రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నిత్యం నీళ్ల పోస్తూ వాటిని కాపాడిన బంక సోమమ్మను సోమవారం గ్రామానికి చెందిన కొల్లు సైదులు, నారబోయిన లక్ష్మయ్య, కొల్లు శ్రీనివాస్‌ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. మొక్కలను సంరక్షించడంతో పెద్ద వృక్షాలుగా మారాయని అన్నారు. అనంతరం ఆమెకు రూ.1500 నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పాల్గొన్నారు.